సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
గురువారం,16 మే 2024


# కలుషిత నీటితో అనారోగ్యం బారిన పడి గిరిజన మహిళ మృతి

- కురుములతోగులో వాంతులు, విరోచానాలతో పలువురు



**కుక్కునూరు,మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని దామరచర్ల గ్రామ సమీపంలో కురుములతోగు అనే వలస గిరిజన గ్రామంలో గత కొంతకాలంగా నివసిస్తున్న వలస గిరిజనులు మంచినీళ్లు లేక వాగులో నీళ్లు తాగుతూ అనేక ఇబ్బందులు పడుతున్నారు గత 3 రోజుల నుండివచ్చిన వర్షాలతో వాగి పొంగి పారుతున్న కలుషిత నీరు తాగడం వల్ల ఆగ్రామంలోని ప్రజలు వాంతులు విరోచనాలతో బాధపడుతున్నారు.ఆ కలుషిత నీరు తాగి బుధవారం కారంబుజ్జమ్మ (65)అనే మహిళ చనిపోయింది 6 సంవత్సరాల మడకం దేవయ్య,6 సంవత్సరాల కల్లూరి శాంతి,6 సంవత్సరాల మడెం సంజన , 30 సంవత్సరాల వయస్సు గల పోనేం మంగయ్య, 40 సంవత్సరాల వయస్సు గల వెట్టి లక్ష్మి ఇలా సుమారు మరొక 10 మంది వరకు వాంతులు విరోచనాలతో బాధపడుతున్నారని,వారి పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలియజేసారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ గ్రామంలో ప్రజలకు మంచినీళ్లు సౌకర్యం ఏర్పాటు చేయాలని,వైద్య సిబ్బంది శిబిరాలు ఏర్పాటు చేసే వారిని ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# జూన్,6వ తేదీ వరకు 144 సెక్షన్ పొడిగింపు

## -జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్



**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముగిసే జూన్,6వ తేదీ వరకు 144 ఎ సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం కొన్ని ప్రాంతాలలో శాంతి భద్రతలకు అవాంతరం కలిగే అవకాశం ఉన్నందున సందర్భంగా ఈనెల క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 లోని 144 సెక్షన్ కింద అధికారాలను అమలు చేస్తూ 14వ తేదీ వరకు ఉన్న 144 సెక్షన్ ను జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముగియనున్న జూన్, 6వ తేదీ వరకు పొడిగించడం జరిగిందన్నారు. జిల్లాలో 144వ సెక్షన్ అమలు సమయంలో చట్టవిరుద్ధమైన సమావేశాలు, బహిరంగా సభలు, ర్యాలీలు నిర్వహించడం నిషేదమన్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా,5గురు కంటే ఎక్కువగా ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు ఆయుధాలు,తుపాకిలు, పదునైన వెపన్లు, లాఠీలు, కర్రలు,రాళ్లు వంటివి వెంట తీసుకువెళ్లడం,ప్రదర్శించడం నిషేధమని ఆయన స్పష్టం చేశారు.

# జిల్లాలో 83.68 శాతానికి పెరిగిన పోలింగ్

## పోస్టల్ బ్యాలెట్‌తో మరో 1.15 శాతం పెరగనున్న పోలింగ్ జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలతో పెంపుదల





**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలింగ్ శాతం నమోదైంది. 2024 సార్వత్రిక ఎన్నికలలో జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో సగటున 83.68 శాతం నమోదైంది. జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాలలో 16 లక్షల 37 వేల 430 మంది ఓటర్లు ఉండగా, 13 లక్షల 70వేల153(83.68శాతం)ఓట్లు పోలయ్యాయి. అదేవిధంగా 7 లక్షల 99 వేల 241 మంది పురుషులకుగాను 6 లక్షల 77 వేల 056 ఓట్లు నమోదుకాగా, 8 లక్షల 38 వేల 063 మంది మహిళా ఓటర్లు ఉండగా వారిలో 6 లక్షల 93 వేల 045 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతరులు 126 మంది ఉండగా వారిలో 52 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**- నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ -** పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఇప్పటివరకు 18 వేల 201 మంది(1.15శాతం)తమఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉంగుటూరునియోజకవర్గంలో1614 మంది, దెందులూరు నియోజకవర్గంలో 2165 మంది,ఏలూరు నియోజకవర్గంలో3123మంది,పోలవరం నియోజకవర్గంలో 2872 మంది,చింతలపూడి నియోజకవర్గంలో 2267 మంది,నూజివీడు నియోజకవర్గంలో 1923 మంది, కైకలూరు నియోజకవర్గంలో 1651 మంది పోస్టల్ బ్యాలెట్‌ద్వారాతమ ఓటుహక్కును వినియోగించు కున్నారు. వారిలో ఎన్నికల విధులకు హాజరయ్యే 15 వేల 615 మంది సిబ్బంది కాగా,43 మంది సర్వీస్ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.85 సంవత్సరాల వయస్సు దాటిన వారు 500 మంది, విభిన్న ప్రతిభా వంతులు 369 మంది, అత్యవసర సర్వీస్ కు సంబంధిం చిన సిబ్బంది 1674 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

**- ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఓట్లు పోలింగ్-** ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 16లక్షల 37 వేల 430 మంది ఓటర్లకు గాను, 13 లక్షల 70 వేల 153 మంది తమ ఓటుహక్కును వినియోగించు కున్నారు. వారిలో 7 లక్షల 99 వేల 241 మంది పురుషులకు గాను,6 లక్షల 77 వేల 056 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా, 8 లక్షల 38 వేల 063 మంది మహిళలకు గాను 6 లక్షా 93 వేల 045 మంది మహిళలతమఓటుహక్కును వినియోగించు కున్నారు. 126 మంది ఇతరులకుగాను 52 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

# జిల్లా కలెక్టర్‌కు అభినందనలు తెలిపిన మానవత సభ్యులు



**ఏలూరు,మేజర్‌న్యూస్:**సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగిన సందర్భంగా మానవత ఏలూరు యూనిట్ కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ ను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షుడు మేతర అజేయ్ బాబు మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రారంభం నుంచి జిల్లా అంతటా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తూ జిల్లా యంత్రాంగాన్నిఅప్రమత్తంచేసి అవాంఛనీయ సంఘటనలు,పొరపాట్లు జరుగకుండా చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో మానవత యూనిట్ రీజనల్ చైర్మన్ పోలవరపు దేవ రత్నాకరరావు,యూనిట్ చైర్ పర్సన్ అడుగుమిల్ల నిర్మల,సభ్యులు అల్లూరి మోహిని, మేడికొండ పద్మజ,డి.భారతి,వై.విష్ణు,అగ్గాల కోహాదిం ఉన్నారు.

# కావూరి లావణ్య ఆరోపణలు నిరాధారం

- పార్టీ నుండి సస్పెండ్ చేయాలని పీసీసీకి ఫిర్యాదు చేస్తాం
- డిసిసి అధ్యక్షులు రాజనాల, ఆలపాటి, ఎమ్మెల్యే ఎలీజా,అభ్యర్థులు



**ఏలూరు, మేజర్ న్యూస్ :** భారత జాతీయ కాంగ్రెస్ తరపున ఏలూరు పార్లమెంటుకు పోటీ చేసిన కావూరు లావణ్య తనపై చేసిన ఆరోపణలు నిరాధారమని ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు ఖండించారు. బుధవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజనాల రామ్మోహన్ రావు విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన అసెంబ్లీ అభ్యర్థులపై నిరాదారణ నిందారోపణలు చేయడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఏపిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల ప్రకారం అందర్నీ కలుపుకొని అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గం లో పనిచేస్తామని మాటిచ్చామని, అయితే ఏలూరు ఎంపీ అభ్యర్థి అయిన కావూరు లావణ్య అసెంబ్లీ అభ్యర్థులపై ఆరోపణ చేయడం, అభ్యర్థులు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడం ఎవరూ సహకరించలేదని ఆరోపణ చేయడం అవాస్తవం అన్నారు. ఆమె వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అయితే ఎన్నికల ప్రచారాల్లో భాగంగా అభ్యర్థికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నియోజకవర్గం లోకి వచ్చి తనతో సహకరించలేదని చెప్పటం విడ్డూరమన్నారు. దెందులూరు నియోజకవర్గ అభ్యర్థి ఆలపాటి నరసింహామూర్తి మాట్లాడుతూ తనకు రూ.కోటి ఇస్తే ఎమ్మెల్యే టికెట్ ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య బేరసారాలు చేసిన మాట వాస్తవమని సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో మాట్లాడి ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని అందుకు కోటి రూపాయల నజరానా గా ఇవ్వాలని తనను డిమాండ్ చేసినట్టు తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పైన ఆమె ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేయడం తగదని,పార్టీ ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహరించడం సరికాదని ఆమెపై జిల్లా పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పిసిసి అధ్యక్షురాలు షర్మిలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో ఎటువంటి అనుభవం లేకుండా నాలుగు నెలల ముందు వచ్చి 30 ఏళ్ల అనుభవాన్ని ప్రశ్నించడం ఆమె విజ్ఞతకే వదిలి వేస్తు న్నామని నరసింహమూర్తి అన్నారు.ఈ సమావేశంలో చింతలపూడి శాసనసభ్యులు కాంగ్రెస్ అభ్యర్థి, శాసనసభ్యులు ఉన్నమట్ల ఎలిజా,ఉంగుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి హరికుమార్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సంప్రదాయబద్ధంగా అతిరాత్ర మహాయగం

- 11 రోజులపాటు 26 మంది రుత్వికులచే యాగాలు
- సుబ్రహ్మణ్యశర్మ,గజల్ శ్రీనివాస్,నరసింహరాజు,గాదిరాజు బాబు



**భీమవరం,మేజర్‌న్యూస్:**శ్రీఉమా రామలింగేశ్వర ట్రస్ట్ (నెలమూరు) ఆధ్వర్యంలో 11 రోజులపాటు జరిగే రాజా శ్యామల దశమహా విద్య సహిత ‘అతిరాత్ర మహాయాగాన్ని బుధవారం భీమవరం డిఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో సాంప్రదాయ బద్దంగా వేదమంత్రాలతో ప్రారంభించారు. డిఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు), శ్రీఉమా రామలింగేశ్వర వేద పాఠశాల జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ, ప్రవచన కర్త సేవ్ టెంపుల్ చైర్మన్ గజల్ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి యాగాన్ని ప్రారంభించారు. శ్రీఉమా రామలింగేశ్వర ట్రస్ట్ (నెలమూరు) ఆధ్వర్యంలో 76వ యాగం భీమవరంలో నిర్వహించడం మన ప్రాంతానికే సుభిక్షమని అన్నారు. శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ, గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ 11 రోజులపాటు 26 మంది రుత్వికులచే 4 విభాగాల్లో యాగాలు జరుగుతాయని, 25న శౌత్ర స్మార్త పుత్రకామేష్టి యాగంతో ఈ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు.

యాగ పర్యవేక్షకులు చెరుకువాడ రంగసాయి, కాంతేటి వెంకట రాజు మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకుఅతిరాత్రయాగాలు26మంది రుత్వికులచే4 విభాగాలో జరుగుతా యని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు,గోకరాజు పాండు రంగరాజు, కొత్తపల్లి శివరామరాజు ,గన్నాబత్తుల శ్రీనివాస్,కనుమూరి సత్యనారాయణ రాజు, వబిలిశెట్టి శ్రీవేంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరశెట్టి కృష్ణ, నడింపల్లి బంగార్రాజు, భీమాల శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్‌లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్‌పి



**ఏలూరు,మేజర్ న్యూస్:** సార్వత్రికల ఎన్నికల అనంతరం ఈవీఎం ప్యాడ్‌లను ఏలూరు సిఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎం బాక్స్‌లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు 3 అంచెల భద్రత కల్పించిన నేపథ్యంలో బుధవారం ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లో వద్ద భద్రతను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ నిర్వహణలో అలసత్వం వహించకుండా అప్రమత్తతో ఉండాలని,స్ట్రాంగ్ రూమ్‌ల వద్దఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పనితీరుల గురించి అధికారులకు తగిన సూచనలు,సలహాలు ఆదేశాలు ఇచ్చారు. ఎస్పీతో పాటుగా డిటిసి డిఎస్పీ కె.ప్రభాకర్ రావు,ఎస్.బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు,3 టౌన్ ఇన్చార్జ్ ఇన్స్పెక్టర్ కెశ్రీనివాసరావు ,ఏలూరు సిసిఎస్ ఇన్స్పెక్టర్ సిహెచ్ మురళీకృష్ణ,పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


# స్వర్ణమయ గోపుర పథకానికి 57 గ్రాముల 580 మిల్లీగ్రాములు బంగారం కానుక



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** చిన్న వెంకన్న ఆలయ వర్మయ గోపుర పథకమునకు కాళ్ల మండలం పెద్ద అంబిరం గ్రామానికి చెందిన వి.చంద్రశేఖర్ పేరున వారి సతీమణి మీ చంద్రకళ 57 గ్రాముల 580 మిల్లీగ్రాములు బంగారం కానుకగా ఆలయ ఆఫీసు వద్ద బుధవారం సమర్పించారు. వారికి దేవాలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు పథకానికి సంబంధించిన పత్రాలను అందించి స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు.

# పట్టెడు అన్నం తింటున్నామంటే కాటన్ మహాశయుని పుణ్యం

- డా.ఎమ్మెల్యే రామానాయుడు



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** సర్దార్ కాటన్ జయంతి సందర్భంగా పాలకొల్లు నియోజకవర్గం తెలుగు రైతు ఆధ్వర్యంలో బుధవారం పాలకొల్లు లాకుల ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో నిలువెత్తు కాటన్ విగ్రహానికి రైతులతో కలిసి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈసందర్భంగాఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాలో పట్టెడు అన్నం తింటున్నామంటే కాటన్ మహాశయుని పుణ్యమే అన్నారు. ఆయన ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణం జరపడం వల్లనే గోదావరి జిల్లాలు ధాన్యగారంగా మారాయి అన్నారు. అటువంటి మహాశయున్ని జీవితంలో మర్చిపోలేమన్నారు. కనీసం రైతులు పండించుకున్న పంటను అమ్ముకోవడానికి ఎదురు డబ్బులు కట్టాల్సిన పరిస్థితి ఎదురైందన్నారు. రాబోయే కూటమి ప్రభుత్వంలో పోలవరం నిర్మాణం పూర్తవడంతోపాటు రైతులు స్వేచ్ఛగా పంట అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తామని ఎమ్మెల్యే రామానాయుడు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ఉంగరాల నరసింహారావు,పెచ్చెట్టి బాబు,అల్లు రాధాకృష్ణ,జీవి,కోడి విజయభాస్కరరావు, మామిడి శెట్టి పెద్దిరాజు, కడలి గోపాలరావు,బోళ్ల సుభాష్ చంద్రబోస్,కొండ్రెడ్డి సూరిబాబు ఇంటి శ్రీరామ్మూర్తి అందే కోటి వీరభద్రం,దొంగ బాబాయ్,తాళ్లూరి సత్య శ్రీనివాసరావు, బోనం నాని, చెరుకూరి అంజి పాల్గొన్నారు.


# కొప్పర్రులో సర్ ఆర్థర్ కాటన్ జయంతి



**నరసాపురం రూరల్,మేజర్ న్యూస్ :** గోదావరి జిల్లాలను సత్యశ్యామలం చేసిన భగీరథుడు, సరార్థన్ కాటన్ జయంతి కొప్పర్రు కోపరేటివ్ బ్యాంకు దగ్గర ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు మిత్ర సేవకుడు చినిమిల్లి వీరబాబు,ముక్కు గణపతి,పోలిశెట్టి సత్తిబాబు, కదిలి సత్యనారాయణ, బద్ద బుజ్జి, చల్లబోయిన శివ, తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపురంలో జనసేన మెజార్టీపై భారీ అంచనాలు



**నర్సాపురం,మేజర్‌న్యూస్:** నరసాపురం అసెంబ్లీకి సోమవారం జరిగిన ఎన్నికపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది.ఈ ఎన్నికలో వైసీపీ అభ్యర్థిగా ముదునూరిప్రసాదరాజుమరోసారిపోటీ చేశారు. జనసేన,తెలుగుదేశం,బిజెపిల ఉమ్మడి అభ్యర్థిగా బొమ్మిడి నాయకర్ పోటీలో ఉన్నారు. ఎన్నిక అనంతరం ఈ అసెంబ్లీ సీటుపై ప్రజల్లోనూ, పరిశీల కూల్లోనూ గెలుపు ఓటముల పైచర్చ జరుగుతోంది. వైసీపీ తరపున పోటీ చేసిన ముదునూరి ప్రసాదరాజు ఒంటరి పోరాటం చేశారని చెప్పాలి. ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి,జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌ను గెలిపించేందుకు 3 పార్టీలకు చెందిన కీలకమైన నేతలు రంగంలో దిగారు.

ఎవరికి వారు గ్రామాలు తిరుగుతూ వైసీపీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు నియోజకవర్గానికి అన్యాయం చేశారంటూ ప్రచారం చేస్తూ మూకుమ్మడిగా రాజకీయ దాడి కొనసాగించారు. జిల్లా కేంద్రం, మెడికల్ కాలేజీ, ముఖ్యమంత్రి సంకుస్థాపనలు చేసిన పనులపై ప్రజలకు వివరిస్తూ వైసీపీ అభ్యర్థిని ఓడించాలని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. తెలుగుదేశం నుండి మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్, తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పొత్తూరి రామరాజు, జనసేన పార్టీ నుండి మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ, బిజెపి నాయకులు నాయకర్ గెలుపు కోసం బరిలో నిలిచారు. చంద్రబాబు,పవన్ కళ్యాణ్‌ల ఆదేశాలమేరకువీరంతా అంకితభావంతో పని చేశారు. ఎన్నిక అనంతరంజనసేన అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందుతారని ధీమాగా చెబుతున్నారు. వైసీపీ నుండి పోటీ చేసిన ముదునూరి ప్రసాద్ రాజు వర్గీయులు మాత్రంఅన్ని వర్గాల ప్రజలు మాకే ఓట్లు వేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు జరిపిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందయని, మునుపెన్నాడు లేనటువంటి సంక్షేమ పథకాలు ఇంటింటికి అందజేశామని ఆయన గెలుపు ఖాయమని చెప్తున్నారు. ఒకపక్క గెలుపు ఖాయం అని చెబుతున్నప్పటికీ మనసులో ఏదో ఆందోళన చెందుతున్నట్లు వైసీపీ నాయకుల తీరు కనిపిస్తుంది.

జనసేన అభ్యర్థికి స్థానికంగా ఉన్నటువంటి ప్రముఖులు రంగంలో దిగి పని చేయటంతో వైసీపీ గెలుపు పై ఆశలు వదులుకున్నట్లు కూడా ఆ పార్టీలోని కొంతమంది నాయకుల మాటల తీరును బట్టి అర్థమవుతుంది. ఈ నియోజకవర్గంలో 1 లక్ష 70 వేల మంది ఓటర్లు ఉండగా,1 లక్ష 43 వేలమంది ఓటింగ్ లో పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలలో వలె ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఓట్లు వేసేందుకు వచ్చారని,వారంతా జనసేన వైపే ఉన్నారని ఆ పార్టీలకు చెందిన వారు చెప్తున్నారు. ఏది ఏమైనా ఇరు పార్టీల నాయకులు గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తూనే ఉన్నారు. గెలుపు ఎవరిది అనేది తేలాలంటే జూన్ 4 వరకు వేచి ఉండక తప్పదు.


సూర్య
పశ్చిమ గోదావరి
గురువారం
16 మే 2024


# నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** సార్వత్రిక ఎన్నికలలో పోలవరం నియోజకవర్గం కూటమికి సహకరించిన నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్ తెలిపారు. జీలుగుమిల్లిలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మహిళలు ఎంతో కష్టపడి ప్రచారంలో పాల్గొని మాకు సహకరించారని అన్నారు. రైతులు విద్యార్థులు కూటమి అభ్యర్థి విజయానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాలలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన కూటమి నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. జూన్ 4వ తేదీన కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు గెలుపును పండుగలా జరుపుదామని పిలుపునిచ్చారు.

# వేడుకగా వాసవి మాత జయంతి ఉత్సవాలు



**పెనుగొండ,మేజర్ న్యూస్:** పెనుగొండ మండలం పెనుగొండ పట్టణంలో వేంచేసి ఉన్న మహిసాసుర మర్ధిని, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం సామూహిక సువాసిని పూజలు నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి' లేదా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారి అవతారంగా హిందువులచే పూజింపబడే ఒక దేవతామూర్తి. ప్రధానంగా గొమతి లేదా ఆర్య వైశ్యులు కులస్తులకు కులదేవత. ఈ కులస్తులు అధికంగా ఆంధ్ర ప్రదేశ్‌లోను, ఇంకా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోను నివసిస్తున్నారు. ఈనెల 18 నకన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా, మంగళవారం జయంతి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఉదయం నుంచి నియమ, నిష్ఠలతో సువాసిని పూజా కార్యక్రమం లో భక్తులు అధికంగా పాల్గొన్నారు.

# ఎక్స్ వేదికగా కాకసనూరు గిరిజన తండా స్వాగతంపై ట్వీట్





## భారత ఎన్నికల కమిషన్ ప్రశంసలు - అరుదైన గౌరవం

**వేలేరుపాడు,మేజర్ న్యూస్:** వేలేరుపాడు మండలం,కోయిదా పంచాయతీ పరిధిలో కాకసనూరు గిరిజన తండా ఉంది. ఈ ఎన్నికల సమయంల సిబ్బంది సేవలపై భారత ఎన్నికల కమిషన్ ప్రశంసించింది. ఎక్స్ వేదికగా కాకసనూరు గిరిజన తండా స్వాగతం పై ట్వీట్ పోలవరం ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం పరిధిలో ఈ తాండవాసులు ఉంటారు. ఇక్కడ అందరు కొండ్రెడ్డి తెగకు చెందిన పర్టిక్యులర్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూపుకు (పివిటిజి) చెందిన వారు కావడం విశేషం. కాకసనూరు తండా ఏలూరు జిల్లా కేంద్రానికి 180 కిమీ దూరంలో ఉండడం వలన ఈ ప్రాంతానికి చేరుకోవాలంటే సుమారు 3 గంటల పాటు ఏజెన్సీ ప్రాంతలో రోడ్డు మార్గం ద్వారా కోయిదా గ్రామం చేరుకొని అక్కడ నుంచి గోదావరి నది ప్రవాహాన్ని తట్టుకొని పడవ ప్రయాణం గంట పాటు చేసి కాకసనూరు తండా చేరుకోవాలి. దానిలో భాగంగా 472 ఓటర్లు ఉన్న కాకసనూరు పోలింగ్ కేంద్రం ముస్తాబు అయ్యింది. అయితే రాండమైజేషన్ పద్ధతిలో ప్రెసైడింగ్ అధికారి శ్రీధర్ బృందానికి పోలింగ్ నిర్వహించే అవకాశం వచ్చింది. ఈ బృందంతో స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస్ పాల్గొన్నారు. కాకసనూరు పోలింగ్ కేంద్రంలో ఓటు వెయ్యాలంటే ఓటర్లు పేరంటాలపల్లి, టేకుపల్లి నుంచి కాకసనూరు వచ్చి ఓటు వేయాల్సి ఉంటుంది. మే 12వ తేదీన గోదావరి నది ప్రవాహాన్ని దాటి కాకసనూరు తాండకు ఎన్నికల బృందం వెళ్లేసరికి సమయం అర్ధరాత్రి అయ్యింది. అయితే ఈ ప్రాంత తండా వాసులు పోలింగ్ సిబ్బంది రాక విషయాన్నీ ముందుగానే తెలుసుకున్న గిరిజనులు సంప్రదాయాల ప్రకారంగా ఎన్నికల సిబ్బందికి పూల దండాలు వేసి ఘన స్వాగతం పలికారు. తమ సంస్కృతి సంప్రదాయాలను భారత ఎన్నికల కమిషన్ గుర్తించి ఎక్స్ వేదిక ద్వారా ప్రపంచానికి తెలియజేసినందుకు కాకసనూరు గిరిజన తండాకు ప్రత్యేక గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాకి,కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, భారత ఎన్నికల కమిషన్‌కు కాకసనూరు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

# పోలీసుల ఫ్లాగ్ మార్చ్



**దెందులూరు,మేజర్ న్యూస్:** జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి,నూజివీడు డిఎస్పి లక్ష్మయ్య ఆదేశాలపై పెదవేగి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై స్వామి సిబ్బంది సాయుధ దళాల సిబ్బందితో కలిసి సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేలాగా ప్రజలకు రక్షణ కల్పించాలని ముఖ్య ఉద్దేశంతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎస్సై మాట్లాడుతూ ఏదైనా పార్టీపై అభిమానంతో ఎన్నికల వరకే అభిమానాన్ని ఉంచుకోవాలని తర్వాత ఊర్లో నివసించే ప్రతి ఒక్కరు ఒకరికి ఒకరు కలిసి మెలిసి జీవనం సాగించాలని కక్షకార్పణ్యాలతో ఏదైనా పోలీస్ కేసులో ఉంటే వారికి వారి కుటుంబానికి ఇబ్బందులు పడతారని అన్నారు. పోలీసు కేసులు కోర్టులు చుట్టూ తిరగాల్సి వస్తుందని,ప్రశాంతమైన వాతావరణంలో అందరూ కలిసిమెలిసి ఉండేలాగా పోలీసు మీకు భరోసా కల్పిస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజలకు తెలియచేశారు.

## జీల్ ఇండియా కంపెనీకి ఎపికైన 14 మంది చాంబర్స్ విద్యార్థులు



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** స్థానిక బిఆర్ఆర్,జీకేఆర్ చాంబర్స్ డిగ్రీ అండ్ పిజి కళాశాలలో బుధవారం జీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రాంగణం ఎంపిక నిర్వహించింది. ఈ ప్రాంగణ ఎంపికలకు 58 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 14 మంది అభ్యర్థులను ఎంపిక చేశారని,వీరికి జీతం ఇతర అలవెన్స్ కలిపి సుమారు రూ.22వేలు నెలకు అభ్యర్థులకు వేతనం వుంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు విద్యార్థులకు లెటర్స్ అందజేసారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కలిదిండి రామరాజు మాట్లాడుతూ విద్యా అనంతరం ఉద్యోగ అన్వేషణలో ఉన్న విద్యార్థుల సౌకర్య గా ఈ ప్రాంగణ ఎంపికలు తమ కళాశాలలో చేపట్టడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఈ ప్రాంగణ ఎంపికలకు జీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హెచ్.ఆర్ మేనేజర్ హేమ భూషణ్,వెంకట రమణ అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్ హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ ఇంచార్జ్ కె లక్ష్మణరావు, కళాశాల ట్రైనర్ కె.సంతోష్ ప్రసాద్,ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో గోదావరి జిల్లాల స్ఫూర్తి ప్రదాత సర్ ఆర్థర్ కాటన్ 221 వ జయంతిని ఇరిగేషన్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుమారు ఒకటిన్నర శతాబ్దం క్రింద గోదావరి నదికి వరదలు వచ్చినా, ప్రవాహం ఎక్కువగా వున్నా,నీరంతా సముద్రం పాలవుతూ ఉండేది. ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వంలో పని చేస్తున్న కాటన్ దొర తనకున్న కొంతమంది అనుచరులతో గుర్రం మీద తిరుగుతూ ఉభయగోదావరి జిల్లాల్లో కాల్వల నిర్మాణం కోసం సర్వే చేసి ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించారని అన్నారు. ఈ సందర్భంగా ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దేవ ప్రకాష్ ఇంజినీర్లు కె.రాజు, బాబూరావు అర్జున్,బొట్టా శ్రీనివాస్,ప్రిసిల్లా,పంజా కిషోర్,మిదిలేష్,రిటైర్డ్ ఇంజినీర్ ముక్కామల కృష్ణా రావు ఇరిగేషన్ సిబ్బంది నోరి శ్రీనివాస్,మధుసూదన్, వెంకటపతి రాజు,జె పి ఏ ఓ వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నోరు అదుపులో పెట్టుకో - డిసిసి అధ్యక్షులపై ఆరోపణలు అవాస్తవం

## - కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి లావణ్య పై ఫైర్



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** అహంలేని నాయకుడు, మంచి మనిషి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామోహన్‌రావు పై ఏలూరు కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి కావూరి లావణ్య లేనిపోని ఆరోపణలు చేయడం సరైంది కాదని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కునపోము రాజారత్నం అన్నారు. బుట్టాయిగూడెం మండల అధ్యక్షులు చిలిపి కుటుంబరావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులతో బుధవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కునపోము రాజారత్నం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మండల పార్టీ అధ్యక్షులను విస్మరించిందని తెలిపారు. కరపత్రాల్లో నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యే అభ్యర్థుల ఫోటోలు పెట్టకుండా తన ఫోటో మాత్రమే పెట్టుకోవడం,ప్రచార రథలకు పర్మిషన్లు తీసుకోకపోవడం నాయకులను కార్యకర్తలను కలుపు కోకుండా తాను ఇష్టానుసారంగా వ్యవహరించడం వంటి వాటిపై జిల్లా అధ్యక్షులకు మండల పార్టీ అధ్యక్షులు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ విషయంపై ఎంపీ అభ్యర్థిని పిలిపించి మాట్లాడారని అందరూ సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపుకు కృషి చేయాలని చెప్పినట్లు తెలిపారు. దానిని ఎంపీ అభ్యర్థి వక్రీకరిస్తూ తనను డబ్బులు అడిగినట్లు బ్లాక్ మెయిల్ చేసినట్లు జిల్లా అధ్యక్షులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నరని వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీ అభ్యర్థి జిల్లా అధ్యక్షులు పై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో టి.నర్సాపురం మండల అధ్యక్షులు సాధనాల నరసింహారావు, ఏలేరుపాడు మండల అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణ, జీలుగుమిల్లి మండల అధ్యక్షులు అల్లి కిషోర్ కుమార్,పోలవరం మండల అధ్యక్షులు ముచ్చిక సీత,కుక్కునూరు మండల అధ్యక్షులు గజ్జిరాజు, బుట్టాయిగూడెం మండల అధ్యక్షులు టిడిపి కుటుంబరావు, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు అమర్తల ఏసుపాదం,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు పైదా పోతురాజు, నియోజకవర్గ సమన్వయకర్త అల్లి రాంబాబు తదితరులు ఉన్నారు.

# కాటన్ సేవలు చిరస్మరణీయం



**భీమడోలు,మేజర్ న్యూస్ :** ఉభయగోదావరి జిల్లాలు సస్యశ్యామలంగా ఉండటానికి కారణమైన ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించిన సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మ రణీయమని, రానున్న తరాలు సైతం ఇదే ఒరవడి కొనసాగిస్తాయని జల వనరుల శాఖ గుండుగొలను నీటి పారుదల శాఖ. కార్యాలయ పర్యవేక్షకులు ఆర్. సత్యనారాయణ అన్నారు. గుండుగొలను కార్యాలయం వద్ద కార్యాలయ సిబ్బంది, లస్కర్లు, రైతులు భాగస్వామ్యంతో కాటన్ జయంతి పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిలా విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం ఆనకట్టతో పాటు,కృష్ణా నది ఆనకట్ట నిర్మాణం,విశాఖ పోర్టు నిర్మాణానికి ఆయన అందించిన సేవలు గురించి వక్తలు వివరించారు. ఆయన చేసిన కృషి ఫలితంగానే ఏలూరు కాలువ ద్వారా గోదావరి- కృష్ణా జలాల అనుసంధానం, కాకినాడ నుంచి అప్పటి మద్రాస్ వరకు జల రవాణా సేవలు అందుబాటులో వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ యూనియన్ నాయకులు బాబురావు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఏలూరు నియోజకవర్గ ఓటర్లకు కృతజ్ఞతలు

## సిపిఐ ఏలూరు అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వేసవి ఎండను లెక్కచేయకుండా అర్ధరాత్రి వరకూ క్యూలో నిలబడి ఓటు వేసిన ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లకు ఇండియా కూటమి,సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో తనకు ఓటేసిన ప్రజలకు,శ్రేయోభిలాషులకుఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలు,నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు.సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ,రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ,జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్,సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తో పాటు సిపిఐ శ్రేణులు,రోడ్డు షోలో పాల్గొని ఓటర్లను చైతన్యవంతం చేసి, తనకు ఓట్లు పడేవిధంగా కృషి చేసినందుకు ధన్యవాదాలన్నారు. వివిధ రూపాల్లో మద్దతిచ్చిన సిపిఎం,కాంగ్రెస్,అమ్ అద్మీ,భారత్ బచావో పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఎస్‌సి,ఎస్‌టి,బీసీ,మైనార్టీలపై టిడిపి దాడులు

## - డిజిపి తక్షణమే వారిని అరెస్టు చేయాలని డిమాండ్



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అధికారులు,ప్రజలు, వైఎస్ఆర్సిపి కార్యకర్తలపైనే ఎక్కువగా టిడిపి దౌర్జన్యాలకు పాల్పడిందని,వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి,నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీజీపీకి విజ్ఞప్తి చేశారు.ఎన్నికల సందర్భంగా పలు చోట్లతలెత్తినహింసాత్మకఘటనలను డిజిపి దృష్టికి తీసుకొచ్చారు .చంద్రగిరి,గురజాల,తాడిపత్రి,గోపాలపురం తదితర నియోజకవర్గాల్లో టిడిపి నాయకులు,కార్యకర్తలు చేసిన హింసకాండ అంశాలపై మాట్లాడారు. ఎమ్మెల్యేలపై దాడులు చేస్తుంటే స్థానిక పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరించారని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. టిడిపికి ఓటు వేయలేదు అన్న కారణాలతో మహిళలు,బీసీ,ఎస్‌సి,ఎస్‌టిలపై టీడీపీ నాయకులు దాడులు చేస్తున్నారన్నారు. టిడిపి నాయకుల దాడులను స్థానిక పోలీసుల దృష్టికి తీసుకొచ్చినా స్థానిక పోలీసులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు డీజీపీకి తెలిపారు. టిడిపి దౌర్జన్యాలను హింసకాండను తక్షణమే అడ్డుకోవడంలో విఫలమైతే.. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తుతాయని వరప్రసాదరావు హెచ్చరించారు.దాడులకు పాల్పడ్డ నాయకులను, కార్యకర్తలను చట్టం ప్రకారం వెంటనే అరెస్టు చేయాలని కోరారు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో కచ్చితంగా తెలియజేయాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ని కోరారు.

# స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అప్రమత్తతతో విధులు

## - పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పి మేరి ప్రశాంతి ఆదేశం



**ఏలూరు,మేజర్‌న్యూస్:** సార్వత్రి క ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎస్పీ డి మేరీ ప్రశాంతి ఏలూరు పట్టణంలో సుడిగాలి పర్యటన చేసి అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాలను పరిశీలన చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందికి తగిన సూచనలు ,సలహాలు,ఆదేశాలు ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ ల వద్ద అప్రమత్తపుతో విధులు నిర్వహించాలని,స్ట్రాంగ్ రూమ్ ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు, స్ట్రాంగ్ రూమ్ చుట్టుపక్కల 144 సెక్షన్ అమలులో ఉన్నదని ప్రజలు ఎవరు కాలేజీ చుట్టుపక్కల సంచరించరాదని హెచ్చరించారు. జిల్లా ఎస్పీతో పాటుగా,డిఎస్పి ఈ శ్రీనివాసులు ,ఏలూరు ఇన్చార్జి ఇన్స్పెక్టర్ కే శ్రీనివాసరావు,టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్,వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీ అండ



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** పార్టీ కోసం నిరంతరం శ్రమ పడే కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణ చెరువు చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త గుబ్బల సత్యనారాయణ (జామకాయల పొట్టి)కు రోడ్డు ప్రమాదంలో గాయపడగ తుంటి ఎముకకు ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ మేరకు అతనికి పితాని 50 వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని పార్టీ గ్రామ అధ్యక్షుడు ఘంటా వాసు,ఇతర నాయకుల ద్వారా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా చరవాణిలో అతనితో మాట్లాడి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. పార్టీకి బలం కార్యకర్తలేనన్నారు. వారికి ఏ కష్టం వచ్చినా పార్టీ వెన్నంటే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తేతలి గోపిరెడ్డి, కొప్పిశెట్టి సూరయ్య, బోనం సుబ్రమణ్యం, గుడాల కనకారావు, గంజం సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# జయప్రద,రమ్యకృష్ణ,కాజల్ సందడి చేసిన జీ తెలుగు 19వ వార్షికోత్సవ వేడుక

## - జీ మహోత్సవం

## ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు


**రాజమండ్రి,మేజర్ న్యూస్:** 2023 తెలుగు టెలివిజన్ పరిశ్రమలో ప్రేక్షకులకు వినోదం పంచుతూ అగ్రగామిగా నిలుస్తున్న ఛానళ్లలో ఒకటి జీ తెలుగు. ఆసక్తికరమైన కథలతో, ఆకట్టుకునే కథనాలతో సాగుతున్న సీరియల్స్తో పాటు భిన్నమైన కాన్సెప్టతో రూపొందుతున్న రియాలిటీ షోలు,ప్రత్యేక కార్యక్రమాలతో ప్రేక్షకులకు ఎనలేని వినోదాన్ని పంచుతున్న జీ తెలుగు విజయవంతంగా 19వ సంవత్సరాలు పూర్తి చేసుకుంది. సరికొత్త కార్యక్రమాలతో అన్ని వయసుల ప్రేక్షకులను అలరించడమే లక్ష్యంగా సాగుతున్న జీ తెలుగు 19 వసంతాల వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. తెలుగు టెలివిజన్ చరిత్రలో నూతన ఒరవడి సృష్టిస్తూ విజయపథంలో సాగుతున్న జీ తెలుగు19వ వార్షికోత్సవ ప్రత్యేక కార్యక్రమం జీ మహోత్సవం మే 19న సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో మాత్రమే! తెలుగు ప్రేక్షకుల నుంచి అశేష ఆదరణ పొందుతూ విజయపథాన కొనసాగుతున్న జీ తెలుగు 19వ వార్షికోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఈ వేడుకలో జయప్రద, రమ్యకృష్ణ, కాజల్ అగర్వాల్ వంటి ప్రముఖ సెలబ్రిటీలు పాల్గొన్నారు. జీ తెలుగు 19 ఏళ్ల ప్రయాణం గురించి యాంకర్లు రవి, సిరి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సరదాగా సాగిన ఈవేడుకలో జూనియర్-సీనియర్ల మధ్య జరిగిన పోటీ ఆద్యంతం అలరిస్తుంది. సీనియర్ జట్టుకి జయప్రద,జూనియర్ జట్టుకి రమ్యకృష్ణ నాయకత్వం వహించారు. ఈ ఇద్దరి గ్రాండ్ ఎంట్రీతో ఘనంగా మొదలైన పోటీడ్రామా జూనియర్స్ అంత్యాక్షరి స్కిట్, 1980, 1990 దశకాల్లోని హీరో హీరోయిన్ల గెటప్లతో సాగిన ప్రదర్శనలతో ఆసక్తికరంగా సాగింది. టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ సర్ప్రైజ్ ఎంట్రీ జూనియర్ టీమ్లో మరింత ఉత్సాహం నింపింది. ఈవేదికపై డ్రామా జూనియర్స్ పిల్లల అద్భుత ప్రదర్శనతో కె.విశ్వనాథ్, చంద్రమోహన్, శరత్ బాబు వంటి తెలుగు సినిమా దిగ్గజ కళాకారులకు నివాళులు అర్పించారు. అనంతరం నటి జయప్రద, రమ్యకృష్ణ వారితో తమ వ్యక్తిగత జ్ఞాపకాలను పంచుకోవడంతో పాటు సినీపరిశ్రమలో వారు పోషించిన పాత్రను గుర్తు చేసుకున్నారు.




సరదా సాయంకాలాన్ని మరింత వినోదంగా మారుస్తూ జూనియర్స్, సీనియర్స్ బృందం తల్లీ కొడుకులు,అక్కా చెల్లెళ్ల బంధాలను ప్రతిబింబించే అద్భుత ప్రదర్శనతో అలరించారు. రమ్యకృష్ణ నటించిన పాపులర్ చిత్రం అమ్మోరును జూనియర్ టీం రీక్రియేట్చేసింది. యష్మి, ఇతర జూనియర్ టీం సభ్యులు రమ్యకృష్ణ జీవిత ప్రయాణాన్ని వర్ణించే ప్రదర్శనతో అబ్బురపరిచారు. 80,90, వర్తమానాల్లో ఆల్ టైమ్ ఫేవరెట్హిట్స్ అయిన ప్రముఖ జీ తెలుగు షో సరిగమపలోని పాటలను సీనియర్లు, జూనియర్లు ఆలపించారు. వైభవంగా జరిగిన ఈ కార్యక్రమం పాత,కొత్త,గతం, వర్తమానాన్ని ఏకతాటిపైకి తెచ్చింది. ఈ వేడుక జీ తెలుగు 19 సవంవత్సరాల విజయవంతమైన ప్రయాణానికి ప్రతీకగా నిలిచింది.

# గెలుపు మనదే - కార్యకర్తలకు అండగా ఉంటా

## - ఎన్డీఏ కూటమి అభ్యర్థి,మాజీ ఎమ్మెల్యే చింతమనేని



**పెదవేగి,మేజర్‌న్యూస్:** కార్యకర్తల కృషి, పట్టుదలతో విజయం దిశగా అడుగేశామని దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. కుటుంబంలో పెద్దకొడుకుగా ఉండి ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఆయన చెప్పారు. పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాయలయంలో బుధవారం తనను కలిసిన కార్యకర్తలకు ఆయన భరోసా కల్పించారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఐదేళ్ళపాటు రాష్ట్రంతో పాటు నియోజకవర్గంలోనూ అరాచక పాలన సాగిందన్నారు. అవినీతి, అక్రమాలు, మట్టి మాఫియా, ఇసుక దోపిడి కొనసాగిందని, ప్రశ్నించే వారిపై దాడులు, దౌర్జన్యకాండ కొనసాగించారని ఆయన పేర్కొన్నారు. దెందులూరులో ఏనాడైనా ఇలాంటి విషసంస్కృతి జరిగిందా అని ప్రశ్నించిన ఆయన ఇకపై దాడులు, దౌర్జన్యాలకు చరమగీతం పాడిస్తామని దెందులూరులో తిరిగి ప్రశాంత వాతావరణాన్ని తీసుకొస్తానని ఆయన చెప్పారు. ఐదేళ్ళ అరాచకపాలనకు తెరపడుతుందని, మరో 20రోజుల్లో ఎన్డీయే కూటమిలో చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని, ఆపై రాష్ట్రం సుబిక్షంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఐదేళ్ళు అష్టకష్టాలు పడిన కార్యకర్తల కుటుంబంలో పెద్దకొడుకుగా ఉండి ఆదుకుం టానని ఆయన హామీ ఇచ్చారు.